
సాక్షి ఒడిశా

శనివారం। 2। సెప్టెంబర్। 2023



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు
నగదు : రూ. 4,30,696
వెండి : 13 గ్రాముల 100 మిల్లీ గ్రాములు
- భువనేశ్వర్/పూరీ



రహదారి భద్రతకు ప్రాధాన్యం
రహదారి భద్రతకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి టుకుని సాహు అన్నారు. స్థానిక లోక్‌సేవా భవనం మూడో అంతస్తు సమావేశం హాల్‌లో శుక్రవారం రోడ్డు భద్రతా మండలి సమావేశం నిర్వహించారు. - IIలో



అక్రమాలు, అవినీతి ఎన్నాళ్లు..!
గ్రామ పంచాయతీ కార్యాలయల్లో అవినీతి బాగోతాన్ని నిరసిస్తూ భారతీయ జనతా పార్టీ శ్రేణులు ఆందోళనకు దిగాయి. శుక్రవారం వివిధ ప్రాంతాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాయి. - IIలో

న్యూస్‌రీల్

కలెక్టర్ సుడిగాలి పర్యటన



సిమిలిగుడలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ కళాశాల భవనాన్ని పరిశీలిస్తున్న కొరాపుట్ జిల్లా కలెక్టర్ అబ్దుల్ అక్తర్

కొరాపుట్: కొరాపుట్ జిల్లా సునాబెడా మున్సిపాలిటీ పరిధిలోని సునాబెడా, సిమిలిగుడ పట్టణాల్లో కలెక్టర్ అబ్దుల్ మహమ్మద్ అక్తర్ సుడిగాలి పర్యటన చేశారు. సిమిలిగుడ కళాశాలలో నిర్మిస్తున్న సిమిలిగుడ కళాశాల భవనాలను పరిశీలించారు. పట్టణంలో సీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులు, వైద్యులు, సిబ్బందితో మాట్లాడారు. రోగులకు అందుతున్న సేవలు, మందుల పంపిణీ కోసం అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. సునాబెడా మున్సిపాలిటీ పరిధిలో ఒకటో వార్డులో నిర్మిస్తున్న ఆడిటోరియం భవనాన్ని పరిశీలించారు.

డోలీలోనే మగ బిడ్డకు జననం

- జయపురం సమితలో ఘటన



బిడ్డకు జన్మనిచ్చిన జిమా సిరక

జయపురం: పురిటినొప్పిలతో బాధపడుతున్న గర్భిణిని ఆస్పత్రికి తరలించే క్రమంలో డోలీలోనే పండంటి మగ్గబిడ్డకు జన్మనిచ్చింది. ఈ సంఘటన జయపురం సమితి కెవిడి గ్రామ పంచాయతీ హోరడాగుడ గ్రామంలో శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. హోరడాగుడ గ్రామానికి చెందిన జిమా సిరక (25)కు పురిటి నొప్పులు రావడంతో ముగ్గురు మహిళలు, ఆరుగురు పురుషులు డోలీలో దుర్గమ కాలిబాటలో నడుచుకుంటూ జయపురం సమితి రమనగుడ ప్రాథమిక వైద్య కేంద్రానికి తీసుకెళ్లేందుకు బయలుదేరారు. మార్గమధ్యంలో నొప్పులు రావడంతో పర్వత మార్గంలోనే డోలీలోనే సిరక మగ బిడ్డకు జన్మనిచ్చింది. దీంతో ఆస్పత్రికి తీసుకెళ్లకుండా తిరిగి తమ గ్రామానికి తీసుకొని వెళ్లిపోయారు. కొండ ప్రాంతంలో డోలీలో గర్భిణిని మోసుకుంటూ ఆరు కిలోమీటర్లు నడిచి కొండ పైనుంచి దిగి మాలిగుడ గ్రామం చేరితే.. అక్కడ నుంచి అంబులెన్స్‌లో రామనగుడ ప్రాథమిక వైద్య కేంద్రానికి లేదా జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తీసుకెళ్లాలని కుటుంబ సభ్యులు భావించారు. అయితే మార్గమధ్యంలోనే బిడ్డకు జన్మనివ్వడంతో ఇంటికి వెళ్లిపోయారు. బాలింతతోపాటు పుట్టిన శిశువు ఆరోగ్య పరిస్థితి తెలుసుకునేందుకు వైద్య సిబ్బంది రావాలని గ్రామస్తులు కోరారు.

అక్టోబర్ 15న ప్రిలిమినరీ పరీక్ష

భువనేశ్వర్: ఒడిశా పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఓపీసీసీ) ఒడిశా సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ ఎగ్జామినేషన్ తేదీని ప్రకటించింది. ఈ ఏడాది అక్టోబర్15న సివిల్ సర్వీసు ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించాలని కమిషన్ తాత్కాలికంగా నిర్ణయించినట్లు సంబంధిత వర్గాల సమాచారం. ఔత్సాహిక అభ్యర్థులు మరింత సమాచారం కోసం ఓపీసీసీ అధికారిక వెబ్‌సైట్ http://oprc.gov.in లో వివరాలు తెలుసుకోవచ్చని ప్రకటనలో పేర్కొన్నారు.

హడియలో భూ వివాదం

- ఇరువర్గాల మధ్య కొట్లాట

జయపురం: భూమి వివాదం ఇరువర్గాల మధ్య కొట్లాటకు దారితీసిందని జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వరచంద్ర తండి శుక్రవారం వెల్లడించారు. హడియ గ్రామంలో జరిగిన ఈ ఘటనలో అదే గ్రామానికి చెందిన శ్యామసుందర కెవుట, రఘునాథ్ కెవుటను అరెస్టు చేశామన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్యామ సుందర కెవుటకు చెందిన భూమిలో వెదురు గుంప ఉంది. ఈ భూమికి పక్కన అన్నదమ్ములైన రఘునాథ్ కెవుట, బైద్యనాథ్ కెవుట భూములున్నాయి. వీరు అక్కడ ప్రధానమంత్రి అవాస్ యోజన కింద ఇంటిని నిర్మిస్తున్నారు. వెదురు చెట్లను తొలగించాలని శ్యామసుందర కెవుటను డిమాండ్ చేశారు. గత నెల 30వ తేదీన మారణాయుధాలతో వచ్చి చంపుతామని బెదిరించారని శ్యామసుందర కెవుట తన ఫిర్యా దులో పేర్కొన్నారు. అలాగే రఘునాథ్ కెవుట కూడా ఫిర్యాదు చేస్తూ.. తమ భూమిలో ఉన్న వెదురు గుంపను కొట్టివేశామన్నారు. ఆ సమయంలో శ్యామసుందర్ కెవట తోపాటు మరో ఏడుగురు వచ్చి తమపై దాడి చేసినట్లు ఫిర్యాదు చేశాడు. ఇరువురి ఫిర్యాదులపై కేసులు నమోదు చేసినట్లు పోలీసు అధికారి ఈశ్వరచంద్ర తండి వెల్లడించారు. వెదురు గుంప విషయంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం కొట్లాటకు దారి తీసిందన్నారు. 10 మందిపై కేసు నమోదు చేసి ఇద్దరిని అరెస్టు చేశామన్నారు. అంబాగుడ పోలీసు సండి అధికారి ఏఎస్ఐ రవీంద్ర కుమార్ రథ్ దర్యాప్తు జరుపుతున్నట్లు వెల్లడించారు.

• రహ'దారిద్ర్యం'..



చిత్రంలో మీరు చూస్తున్న రహదారి నబరంగ్‌పూర్ జిల్లా శివారు పట్టణాలైన ఉమ్మర్ కోట్- రాయిఘర్ ప్రాంతం. నెలరోజులుగా కురిసిన భారీ వర్షాలకు ఇలా గోతులమయంగా తయారైంది. ఈ రోడ్డులోని నిత్యం అధిక సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డులో ప్రయాణమంటేనే బాబోయ్ అంటున్నారు వాహనచోదకులు. - కొరాపుట్

• మిసైల్ డిస్ట్రోయర్‌లో 'మజ్జి'




సామాజిక మాధ్యమాల్లో చురుగ్గా ఉండే స్వతంత్ర మండలి సలహాదారుడు, మాజీ ఎంపీ ప్రదీప్ మజ్జి తాజాగా సబ్‌మెరైన్‌లో విహరిస్తున్న ఫొటోలను పోస్ట్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో కేంద్ర రక్షణ విభాగానికి చెందిన మిసైల్ డిస్ట్రోయర్(ఢిల్లీ క్లాస్), సబ్ మెరైన్‌లలో విహరించినట్లు ప్రకటించారు. అలాగే విశాఖపట్నం-జయపూర్ విమానంలో ప్రయాణం చేస్తూ ఈ సర్వీస్‌ను విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. - కొరాపుట్

• బా(ం)బోయ్..



అంగుల్ జిల్లా నదీరాలోని తాల్చేర్ నియోజక వర్గం ఎమ్మెల్యే బ్రజకిషోర్ ప్రధాన్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఉదయం బాంబు కలకలం సృష్టించింది. టైమర్‌తో కూడిన బాంబు లభ్యం కావడంతో స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. అప్రమత్తమైన పోలీసులు బాంబు స్కాడ్‌ను రప్పించి బాంబును నిర్వీర్యం చేశారు. పరిసరాల్లో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. ఇది కుట్రదారుల పనేనని అనుమానిస్తున్నట్లు ఎమ్మెల్యే బ్రజకిషోర్ ప్రధాన్ మీడియాకు తెలిపారు. - భువనేశ్వర్



గంజాంలో ఉప్పు పండిస్తున్న రైతు



వర్షాలతో నిండా మునిగిన ఉప్పు పంట

బతుకుల్లో ఉప్పు..నష్టాల నిప్పు

- ఉప్పు రైతు కుదేలు
- పస్తుల్లో పదివేల మంది రైతులు
- ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వలస
- పట్టించుకోని జిల్లా అధికార యంత్రాంగం

బరంపురం: ఉప్పు రైతు కుదేలైపోయాడు. వాతావరణం కలిసిరాక, వ్యాపారంలో లాభాలు లేక పొట్ట చేతపట్టుకుని వలస పోతున్నాడు. వారం రోజుల కిందట గంజాం జిల్లా ఉప్పు రైతులు పండించిన 2 వేల ఎకరాల ఉప్పు పంట నీట మునిగిపోయింది. ఉప్పు మడి తయారీ నుంచి పంట చేతికందే వరకూ ఇంటిల్లిపాదీ ఎంతో శ్రమిస్తారు. కానీ ఈ సారి కష్టం తప్ప ఫలితం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సైక్లోన్ జోన్‌గా గుర్తింపు పొందిన గంజాం జిల్లాను తరచూ తుఫాన్లు వెక్కిరిస్తున్నాయి. ఈ ప్రకృతి వైపరీత్యాల కారణంగా ఉప్పు రైతులకు ఏటా నష్టం తప్పడం లేదు. ఈ వృత్తిలో బతుకు లేక, ఇక్కడ బతకలేక వీరు క్రమేపీ వలస బాట పడుతున్నారు.రాష్ట్రంలో గంజాం జిల్లా హుమ్మా, బించనాపల్లి నుంచి గంజాం వరకు సుమారు 2 వేల ఎకరాల్లో ఉప్పు పంట సాగు చేస్తారు. ఇది రాష్ట్రంలోనే ఏకైక ఉప్పు క్షేత్రం. రాష్ట్రానికి కావాల్సిన ఉప్పు ఒకప్పుడు ఇక్కడి నుంచే సరఫరా అవుతుండేది. పండించే రైతుల దగ్గర నుంచి నేరుగా సహకార సమితులు ఉప్పుని తీసుకొని నగదు చెల్లిస్తుండేవి. అయితే ఐదేళ్లుగా ఇక్కడ పరిస్థితులు మారుతున్నాయి. ఉప్పు ఉత్పత్తి క్రమక్రమంగా తగ్గుతోంది. వాతావరణ సమస్యలే దీనికి ప్రధాన కారణం. అల్పపీడనాలు, తుఫాన్లు వల్ల పంట చేతికి అందే సమయంలో అలలు తీరంపైకి ఎగసి ఉప్పు క్షేత్రాల్లోకి నీరు చేరుతుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.



ఉమ్మాలో తడిసిన ఉప్పు పంటను పరిరక్షిస్తున్న రైతు

తీసుకున్న చర్యలేవి..?

అయితే పరిస్థితి ఇంతగా దిగజారినా జిల్లా పాలనా యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఫలితంగా సుమారు 10 వేల మంది ఉప్పు రైతులు పస్తులుండాల్సి వస్తోంది. చాలా మంది ఈ సంప్రదాయ వృత్తిని వదిలి ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోతున్నారని ఉప్పు రైతులు జి.తరిణి రెడ్డి, కుర ప్రధాన్, హుమ్మా ఉప్పు సహకార సమితి నిర్వహణ అధికారి పితసర ప్రధాన్ చెబుతున్నారు. నిత్యావసరాల ధరలన్నీ పెరుగుతున్నా ఉప్పు ధరలు పెరగకపోవడంతో తమకు నష్టాలు తప్పడం లేదని వారంటున్నారు. ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి ఉప్పు రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

విద్యార్థులకు క్రీడా స్ఫూర్తి అవసరం

- రాయగడ డీఈవో పూర్ణ చంద్ర భొరియా

రాయగడ: విద్యార్థి దశ నుంచే క్రీడా స్ఫూర్తిని అలవర్చుకుని ముందుకు వెళితే ఆయా రంగంలో రాణించగలరని రాయగడ జిల్లా విద్యాశాఖ అధికారి పూర్ణ చంద్ర భొరియా అన్నారు. స్థానిక గొవింద చంద్ర దేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో క్రీడాకారుల ఎంపిక పోటీలు శుక్రవారం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన భొరియా మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి తమకు ఆసక్తి ఉన్న రంగంలో ప్రతిభ కనబరచాలన్నారు. క్రీడా రంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో ప్రోత్సహిస్తోందన్నారు. అందువల్ల క్రీడాకారులు తమ ప్రతిభను కనబరిచేందుకు ఇటువంటి పోటీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ నెల ఏడు నుంచి 25వ తేదీ వరకు రాష్ట్ర స్థాయిలో జరగనున్న వివిధ క్రీడల్లో పాల్గొనేందుకు క్రీడాకారుల ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నామని వివరించారు. బ్యాడ్మింటన్, హ్యాండ్‌బాల్, బాక్సింగ్, వాలీబాల్, హాకీ వంటి అంశాల్లో రాయగడ జిల్లా నుంచి క్రీడాకారులను ఎంపిక చేసి వారిని రాష్ట్ర స్థాయిలో జరగనున్న పోటీలకు పంపించనున్నట్టు వివరించారు. 14 నుంచి 17 ఏళ్లలోపు బాలబాలికల మధ్య పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని 11 సమితుల నుంచి సుమారు 300 మంది క్రీడాకారులు వివిధ అంశాల్లో పాల్గొనేందుకు ఈ పోటీలకు హాజరయ్యారన్నారు. ఇందులో 130 మంది క్రీడాకారులను ఎంపిక చేసి జిల్లా నుంచి పంపిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లాక్రీడా అధికారి షేక్ అలీనూర్, గొవింద చంద్ర దేవ్, ఉన్నత పాఠశాల పీపీటీ సుశాంత్, ఉపాధ్యాయుడు శశిభూషన్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న డీఈవో భొరియా, పక్కనే క్రీడా శాఖాధికారి షేక్ అలీనూర్



బాక్సింగ్ పోటీల్లో బాలికలు



వాలీబాల్ పోటీల్లో బాలురు

తక్కువ సమయంలో ఆదేశాలు రావడంతో..

రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు క్రీడాకారులను ఎంపిక చేసి పంపించాలని రాష్ట్ర క్రీడా శాఖ రెండు రోజుల క్రితం తమకు ఆదేశాలు జారీ చేయడంతో తక్కువ సమయంలో ఎంపిక ప్రక్రియ ఒకేరోజులో పూర్తి చేయాల్సి వచ్చిందని డీఈవో భొరియా వివరించారు. దీని వల్ల జిల్లాలోని అన్ని పాఠశాలల నుంచి ఎక్కువ మంది క్రీడాకారులు పాల్గొనే అవకాశం లేకపోయిందన్నారు.

జీతాలు వెంటనే చెల్లించాలి..

- పేపరు మిల్లు మెయిన్ గేట్‌కు తాళాలు వేసిన కార్మికులు



పేపరు మిల్లు ప్రధాన గేట్‌కు తాళాలు వేసిన కార్మికులు



ప్రధాన గేట్ ముందు ఉద్యోగులు

జయపురం: పేపరు మిల్లు మెయిన్‌గేట్‌కు తాళం వేసి కార్మికులు శుక్రవారం నిరసన తెలిపారు. తమకు బకాయిపడిన జీతాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. క్రామిక సంఘాల నేత ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ మిల్లు యాజమాన్యం 4 నెలల నుంచి కార్మికులకు వేతనాలు చెల్లించడం లేదని.. ఎన్ని సార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. దీనికి నిరసనగా మిల్లు ప్రధాన గేటును మూసివేసామని ఇప్పటికైనా యాజమాన్యం దిగి వచ్చి బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

బీజేడీ సీనియర్ నేత కన్నుమూత



మోహంగసింగ్ మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య రజ్వంత్ కౌర్



మోహంగ సింగ్ (పాత చిత్రం)

మల్కన్‌గిరి: జిల్లాలోని బీజేడీ సీనియర్ నేత మోహంగ సింగ్ శుక్రవారం మృతి చెందారు. ఆయన కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మల్కన్‌గిరి ఆస్పత్రిలో చేరారు. అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందారు. 1977లో మల్కన్‌గిరి వచ్చిన బిజు పట్నాయక్‌తో కలిసి ఆయన పని చేశారు. అప్పటి నుంచి బిజు ఎప్పుడు మల్కన్‌గిరి వచ్చినా ఈయన ఇంటిలోనే భోజనం చేసేవారు. 2016 మల్కన్‌గిరి మున్సిపల్ ఎన్నికల్లో మోహంగ సింగ్ భార్య రజ్వంత్ కౌర్ పురపాలక అధ్యక్షురాలిగా గెలిచారు. వీరికి ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మూడో బిడ్డ ఒడియా సినిమా ఇండస్ట్రీలో కథానాయకుడిగా పనిచేస్తున్నారు. మోహంగ సింగ్ మృతిపై పార్టీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన పార్థివ దేహాన్ని చూసేందుకు వస్తున్నారు. శనివారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

పక్కా ప్రణాళికతో గ్రేటర్ బరంపురం

- బరంపురం అభివృద్ధిపై సీఎం నవీన్ ప్రత్యేక దృష్టి
- శరవేగంగా అభివృద్ధి పనులు
- 156వ స్వపరిపాలన ఉత్సవాల ప్రారంభోత్సవంలో మేయర్ సంఘమిత్ర దొళాయి

బరంపురం: బరంపురం అభివృద్ధికి ముఖ్యమంత్రి నవీన్‌పట్నాయక్ ప్రత్యేక దృష్టి సారించారని.. దీని కోసం పక్కా ప్రణాళికలు కూడా సిద్ధం చేశారని నగర మేయర్ సంఘమిత్ర దొళాయి చెప్పారు. స్థానిక కల్లికోట్ కళాశాల మైదానంలో బరంపురం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 156వ స్వయం స్వపరిపాలన ఉత్సవాలు ఘనంగా ప్రారంభం అయ్యాయి. రాష్ట్ర మంత్రి ఉషాదేవి ముఖ్యఅతిథిగా హాజరైన ఈ కార్యక్రమంలో నగర మేయర్ సంఘమిత్ర దొళాయి మాట్లాడుతూ బరంపురం-ఛత్రపూర్, గోపాల్‌పూర్‌లను కలుపుకొని గ్రేటర్ బరంపురంగా అభివృద్ధి చేయనున్నట్టు చెప్పారు. దీనికోసం ఇప్పటికే బరంపురం నగరంలోని ఇంజినీరింగ్, గోపాల్‌పూర్ జంక్షన్‌లతో పాటు గూడ్స్‌షెడ్ రోడ్‌లో ఫ్లైఓవర్‌ల నిర్మాణం జరుగుతున్నాయని తెలిపారు. ఎప్రోచ్ రోడ్ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం పనులు కూడా వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. నగర శివార్లలోని హల్దియాపదర్‌లో బస్ టెర్మినల్ నిర్మాణంతో పాటు గోపాల్‌పూర్, ఛత్రపూర్ బస్‌స్టాండ్‌లు ప్రారంభం అయినట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బరంపురం ఎంపీ చంద్రశేఖర్ సాహు, అస్కా ఎంపీ ప్రమీలా మల్లిక్, బరంపురం ఎమ్మెల్యే విక్రమ్ పండా, కమిషనర్ సోనాలి జెనాలతో పాటు కార్పొరేటర్లు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న మేయర్ సంఘమిత్ర, మంత్రి ఉషాదేవి, ఎంపీ చంద్రశేఖర్, ఎమ్మెల్యే విక్రమ్ తదితరులు



మీన బజార్‌లో సైకత శిల్పం



వేదికపై అస్కా ఎంపీ ప్రమిలా మల్లిక్‌ని సన్మానిస్తున్న మేయర్ సంఘమిత్ర, మంత్రి ఉషాదేవి, ఎంపీ చంద్రశేఖర్, ఎమ్మెల్యే విక్రమ్



కళాకారుల నృత్యప్రదర్శన

క్లుప్తంగా

సీనియర్ ఫొటోగ్రాఫర్ మృతికి సంతాపం


బాలాజీరావు(ఫైల్)

జయపురం: అవిభక్త కొరాపుట్ జిల్లాలో సీనియర్ ఫొటోగ్రాఫర్ కె.బాలాజీరావు గురువారం విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. జయపురం సొరా వీధికి చెందిన బాలాజీరావు మృతితో స్థానికంగా విషాదం నెలకొంది. ఈయన తండ్రి కె.కూర్మారావు ప్రసిద్ధ ఫొటోగ్రాఫర్. బాలాజీరావు కూడా మంచి ఫొటోగ్రాఫర్‌గా పేరుతెచ్చుకున్నారు. అప్పర్ కొలాబ్ జలవిద్యుత్ ప్రాజెక్ట్ ఫొటోలు తీయటంలో బాలాజీరావు ప్రధాన భూమిక వహించారు. ఆయన మృతి పట్ల జర్నలిస్టు, రచయిత డాక్టర్ పరేష్ రథ్‌తోపాటు పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

'కార్మికులపై నిందలు వేస్తారా..?'

కాశీబుగ్గ: జీడి పరిశ్రమల్లో పనిచేస్తున్న మహిళా కార్మికులను చిన్న చూపు చూడడం తగదని కాష్యూ లేబర్, రైస్ మిల్లర్స్ లేబర్ అసోసియేషన్ కార్యవర్గం పేర్కొంది. లేబరు యూనియన్ కార్యాలయంలో శుక్రవారం వెయ్యి మంది కార్మికులతో సమావేశం ఏర్పాటు చేసి ఆవేదనను వ్యక్తం చేశారు. పాట్నూరు బాలరాజు అనే జీడి వ్యాపారి అతని పరిశ్రమలో పనిచేస్తున్న పదిహేను మంది మహిళలకు దొంగలని నింద వేశారని, ఎలాంటి ఆధారం లేకుండా తప్పుడు నిందలు వేయడం సరికాదని అన్నారు. యజమానులు, కార్మికులు సంయుక్త సమావేశంలో చర్చిస్తుండగా యజమాని ఆ మహిళను చూపుతూ దొంగ దొంగ అని చేతులు తగిలించడంతో ఆమె అతడిని నెట్టిందని అన్నారు. యజమానులు చర్చలు చేయకుండా కార్మికులకు పీసీఎంఏ హాల్‌లో పెట్టి తాళం వేయడం ఏమిటని అన్నారు. కార్మికుల దొంగతనం చేసి ఉంటే నిజ నిర్ధారణ చేయాలన్నారు. కార్మికుల సంఘం ఏర్పడి నలభై ఏళ్లు పూర్తయిందని, యజమానుల సంఘం పెట్టి యాభై ఏళ్లు దాటిందని ఇంతవరకు ఇలాంటి సంఘటనలు లేవని అన్నారు. కార్మికుల పొట్ట కొట్టడానికి ఏ చిన్న కారణం దొరికినా యజమానులు వాడుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు అంబటి కృష్ణమూర్తి, కార్యదర్శి బొమ్మాళి తాతయ్య, అధ్యక్షుడు బోనెల భీమారావు, కోశాధికారి తామాడ రాము, పూర్వ అధ్యక్షులు బొంపల్లి సింహాచలం తదితర కార్మికులు పాల్గొన్నారు.

ఒకే ఈతలో మూడు దూడలు


ఒకే ఈతలో జన్మించిన దూడలు

ఎల్.ఎన్.పేట: మండలంలోని జాడుపేట గ్రామానికి చెందిన గోక జగ్గారావు పెంచుకుంటున్న పాడి ఆవు ఒకే ఈతలో మూడు దూడలకు జన్మనిచ్చింది. ఆవు ఒక కాన్పులో ఒకటి, రెండు దూడలకు జన్మనిస్తుందని మూడు దూడలకు జన్మనివ్వటం అరుదుగా జరుగుతుందని రైతు తెలిపారు. ఆవు దూడలు ఆరోగ్యకరంగా ఉన్నాయని రైతు జగ్గారావు తెలిపారు. పశువైద్యాధికారి జి.కవిత దూడల ఆరోగ్యాన్ని పరీక్షించి రైతుకు తగిన సూచనలు చేశామన్నారు.

దేహదారుఢ్యం కీలకం: ఎస్పీ


పోలీసుల పరేడ్ పరిశీలిస్తున్న ఎస్పీ రాధిక

ఎచ్చెర్ల క్యాంపస్: పోలీసులు దేహ దారుఢ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ జీఆర్ రాధిక అన్నారు. ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులు శుక్రవారం ప్రత్యేక పరేడ్ నిర్వహించారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించిన ఆమె పరేడ్‌ను పరిశీలించారు. పోలీసులు నిరంతరం సాధన చేయాలని, దేహ దారుఢ్యం కోసం శారీరక శ్రమ తప్పనిసరని తెలిపారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. దీనికోసమే గ్రీవెన్స్‌సెల్ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు విఠలేశ్వర్, తిప్పేస్వామి, డీఎస్పీలు వై.శృతి, వాసు దేవ్, ప్రసాదరావు పాల్గొన్నారు.

అక్రమాలు, అవినీతి ఎన్నాళ్లు..!

- రోడ్డెక్కిన బీజేపీ
- ఆందోళనలు, ర్యాలీలతో నిరసన


ఆందోళన చేస్తున్న బీజేపీ పార్టీ నాయకులు


వినతి పత్రం సమర్పిస్తున్న ఉమ్మర్ కోట్ ఎమ్మెల్యే నిత్యానంద గోండో..


దొంగరచించి పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడించిన బీజేపీ శ్రేణులు

కొరాపుట్/జయపురం: గ్రామ పంచాయతీ కార్యాలయల్లో అవినీతి బాగోతాన్ని నిరసిస్తూ భారతీయ జనతా పార్టీ శ్రేణులు ఆందోళనకు దిగాయి. శుక్రవారం వివిధ ప్రాంతాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాయి. నబరంగ్‌పూర్ జిల్లా ఉమ్మర్ కోట్ సమితిలో బీజేపీ పార్టీ కార్యకర్తలు ర్యాలీలు నిర్వహించారు. వీధులలో సభలు ఏర్పాటు చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. అవినీతి, ఇతర ప్రజా సమస్యలపై గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో వినతి పత్రాలు సమర్పించారు. బీజేపీ ఉమ్మర్ కోట్ ఎమ్మెల్యే నిత్యనంద గోండో ఈ నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

దొంగరచించి పంచాయతీ ముట్టడి..

జయపురం సమితి దొంగరచించి గ్రామ పంచాయతీని బీజేపీ శ్రేణులు శుక్రవారం ముట్టడించాయి. అనంతరం కార్యాలయం ఎదుట ధర్నాకు దిగాయి. బీజేపీ నాయకుడు గౌతమ సామంత రాయ్ నాయకత్వంలో వందలాదిమంది కార్యకర్తలు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గౌతమ సామంతరాయ్ మాట్లాడుతూ దొంగరచించి పంచాయతీలో కనీస సదుపాయాలకు ప్రజలు నోచుకోలేదన్నారు. పంచాయతీ పరిధిలోని కంజయిమాలిగుడ, పాత్రోపుట్, బరంగపుట్, బొడొపార, చందిలి, ముక్కుడిపి తదితర గ్రామాల్లో ప్రజలు వివిధ సమస్యలతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి వనరులు లేవని, బోర్లు లేక ప్రజలు కలుషిత నీటిని వినియోగిస్తున్నారని అన్నారు. ప్రధానమంత్రి ఆవాస యోజనలో అవినీతి విలయ తాండవం చేస్తోందని ఆరోపించారు. ఈ నిరసన కార్యక్రమంలో పంపుణీ బీజేపీ మండల అధ్యక్షుడు దీనబంధు ప్రధాన్, జయపురం పట్టణ మండల అధ్యక్షుడు రాధేశ్యామ్ పారిడ, సంతోష్ పాత్రో, రాము బెహర తదితరులు పాల్గొన్నారు.

బీజేడీలో చేరిన కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు


బీజేడీ పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న తిరుపతి పాణిగ్రాహి. జి.తిరుపతి రావు

పర్లాకిమిడి: గజపతి జిల్లా గుసాని సమితి రంప గ్రామంలో శుక్రవారం జరిగిన బీజేడీ పార్టీ మిశ్రణ పర్వ్‌లో పలువురు కాంగ్రెస్, బీజేపీలకు చెందిన కార్యకర్తలు బీజేడీ తీర్థం పుచ్చుకున్నారు. జిల్లా బీజేడీ అధ్యక్షుడు జగబంధు దాస్, సీనియర్ నాయకులు తిరుపతి పాణిగ్రాహి సమక్షంలో దాదాపు వందమంది కార్యకర్తలు పార్టీలో చేరారు. జగబంధు దాస్ పార్టీ కండువాలు కప్పి వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ మిశ్రణ్ పర్వ్‌లో జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతి రావు, గుసాని మండళ బీజేడీ అధ్యక్షుడు సీహెచ్‌ఈశ్వరరావు, ఆర్.ఎం.సీ.యస్ అధ్యక్షుడు యస్.గజపతి రావు, రాష్ట్ర బీజేడీ కార్యదర్శి మారుత్ పాలో, సీనియర్ నేత వై.రామచంద్ర రావు, జెడ్పీటీసీ యస్.బాలరాజు, కాశీనగర్ బ్లాక్ బీజేడీ అధ్యక్షుడు అఖిల పాత్రో తదితరులు పాల్గొన్నారు.


పార్టీలో చేరిన వారికి ఆహ్వానం పలుకుతున్న జిల్లా బీజేడీ అధ్యక్షుడు జగబంధు దాస్

కొనసాగుతున్న పీఈఓల ఆందోళన


కలెక్టరేట్ గేట్ వద్ద రిలే నిరాహార దీక్షలో పీఈఓలు

పర్లాకిమిడి: తమ డిమాండ్ల పరిష్కారం కోసం పీఈఓల రిలే నిరాహార దీక్షలు శుక్రవారం కూడా కొనసాగాయి. గత 15 రోజులుగా డిమాండ్ల సాధనకు స్థానిక కలెక్టరేట్ వద్ద దీక్షలు చేస్తున్న విషయం పాఠకులకు విదితమే. పీఈఓల విద్యార్హత ప్లస్ టూ నుండి ప్లస్ త్రీకి మార్చాలని, ఒడిశా సవరించిన పేస్కేలు-2017 ప్రకారం జీతం 21,700 నుండి రూ. 34,400పెంచాలని, 30 ఏళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న వారికి పదోన్నతి కల్పించాలని కోరుతున్నామని పంచాయతీ కార్యనిర్వాహణ అధికారుల సంఘం అధ్యక్షుడు రాజేంద్ర కుమార్ రథ్ తెలిపారు. గత నెల 23, 25న సంఘ ప్రతినిధులు రాష్ట్ర మంత్రితో చర్చలు జరిపినా ఫలితం శూన్యమని.. డిమాండ్లు పరిష్కరించేంతవరకూ ఆందోళన విరమించేది లేదని ఆయన స్పష్టం చేశారు.

వలంటీర్‌పై దాడి.. కేసు నమోదు

నందిగాం: నందిగాంలో 6వ క్లస్టర్ వలంటీర్‌గా సేవలు అందిస్తున్న గున్న విజయ్‌బాబుపై ప్రగడ ఆనందరావు అనే వ్యక్తి దాడి చేయడంతో అతనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు, బాధితుడు తెలిపిన సమాచారం ప్రకారం.. విజయ్ శుక్రవారం తన క్లస్టర్‌లో పింఛన్లు పంపిణీ చేస్తుండగా ఆనందరావు భార్య వలంటీర్‌ను పిలిచి సిటిజన్ అవుట్ రీచ్ ఫొటోపై మాట్లాడారు. అంతలోనే ఆనందరావు తనపై దాడి చేశారని వలంటీర్ తెలిపారు. దాడిని అడ్డుకున్న గ్రామస్తులను కూడా కొట్టేందుకు వెళ్లాడని పేర్కొన్నారు. వలంటీర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ మహమ్మద్ అమీర్ ఆలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తళుక్కుమన్నారు..


విభిన్న వేషధారణల్లో విద్యార్థులు


విజేతలతో అల్కాదాస్

రాయగడ: విద్యార్థులు వివిధ వేషధారణల్లో తళుక్కుమని మెరిశారు. రాయగడలోని స్థానిక లయన్స్ క్లబ్ సమావేశం హాల్‌లో శుక్రవారం వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు వేషధారణ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సరస్వతీ శిశు విద్యామందిర్, స్వామీ వివేకానంద విద్యామందిర్, అరబిందో ఇంటిగ్రల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ పాఠశాలల నుండి విద్యార్థులు హాజరయ్యారు.

విజేతలు వీరే..

స్వాగతిక గౌడొ (ప్రథమ), రిషి ప్రధాన్(ద్వితీయ), బాబులి బిందాని (తృతీయ)లు బహుమతులను గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో మహిళా క్లబ్ ముఖ్య సలహాదారులు అల్కాదాస్, క్లబ్ ఉపాధ్యక్షురాలు టి.రష్మిత, కార్యదర్శి కస్తూరీ సాహు, కోశాధికారి సీహెచ్ ఇతిశ్రీ, క్లబ్ సీనియర్ సభ్యులు శాంతి కుమారి దేవ్, ఎద్దు శైలజ తదితరులు పాల్గొన్నారు. ఈ పోటీలకు విశ్రాంత ప్రధానోపాధ్యాయులు జగదీష్ చంద్ర దొర, డాక్టర్ లక్ష్మీ నారాయణ సాహు, ఉపాధ్యాయురాలు అంజలి సతపతిలు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

- రాఖీ కట్టించుకుని తిరిగి వస్తుండగా మృతి




ఎన్ఏడీ ఫ్లైఓవర్‌పై లారీ ఢీకొట్టిన ప్రమాదంలో మృతి చెందిన గోవిందరావు (ఇన్‌సెట్లో) గోవిందరావు (ఫైల్)

గోపాలపట్నం : 'రక్షాబంధన్ మా బంధాన్ని తెంచేస్తుందని ఊహించలేదు. రాఖీ కట్టేందుకు రాకపోయి ఉంటే నా అన్న బతికేవాడు' అని ఆ చెల్లెలు ఆవేదన అందర్నీ కలచివేసింది. గురువారం రాత్రి ఎన్ఏడీ ఫ్లై ఓవర్‌పై ట్రాలర్ ఢీకొట్టిన ప్రమాదంలో శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం నిమ్మాడకు చెందిన కొంచాడ గోవిందరావు (27) (అలియాస్ గోపి) అక్కడికక్కడే మృతి చెందాడు. ఎయిర్‌పోర్టు పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం రాఖీ పౌర్ణమి సందర్భంగా అగనంపూడిలో నివాసముంటున్న చెల్లి పద్మ ఇంటికి సాయంత్రం ద్విచక్రవాహనంపై గోవిందరావు వెళ్లాడు. రాఖీ కట్టించుకుని, చెల్లిని ఆశీర్వదించి తిరుగుపయనమయ్యాడు. ఎన్ఏడీ ఫ్లైఓవర్ వద్దకు వచ్చేసరికి స్టీల్‌ప్లాంట్ నుంచి ఐరన్ లోడుతో వెళుతున్న ట్రాలర్ మురళీ నడుపుతున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. వెనుక చక్రాల కింద పడిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు.

రెండు నెలల కిందటే విశాఖకు..

నిమ్మాడ నుంచి రెండు నెలల క్రితమే మురళీ విశాఖ వచ్చాడు. నగరంలో ఓ ప్రైవేటు ట్రావెల్స్‌లో కారు డ్రైవర్‌గా చేరాడు. మురళీనగర్‌లో తన స్నేహితుడు ఇంట్లో ఉంటున్నాడు. మృతునికి తల్లి, తండ్రి, సోదరి ఉన్నారు. తండ్రి అప్పారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎయిర్‌పోర్టు సీఐ బీఎండీ ప్రసాద్ దర్యాప్తు చేపట్టారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

క్రైం కార్నర్

హత్య కేసులో ఐదుగురు అరెస్టు


రైల్వే పోలీసుల అదుపులో నిందితులు

రాయగడ: పొరుగు రాష్ట్రం తెలంగాణలో ఓ హత్య కేసుకు సంబంధించి పరారీలో ఉన్న ఐదుగురు నిందితులను స్థానిక రైల్వే స్టేషన్‌లో రైల్వే పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. తెలంగాణలోని వరంగల్‌లో ఓ హత్య కేసుకు సంబంధించి అనుమానితులుగా ఉన్న ఐదుగురి గురించి అక్కడి పోలీసులు గత రెండు రోజులుగా గాలిస్తున్నారు. నిందితులు విజయవాడకు చేరుకుని అక్కడ నుంచి విశాఖకు వచ్చినట్లు సమాచారం అందుకున్న తెలంగాణ పోలీసులు రాయగడ పోలీసులకు సమాచారం అందించారు. బుధవారం రాత్రి విశాఖపట్నం నుంచి దుర్గ్‌కు వెళ్లే రైల్‌లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఒక బోగీలో ఐదుగురు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి తెలంగాణ పోలీసులకు సమాచారం అందించారు. అరెస్టు అయిన వారిలో మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని బిండా జిల్లా పరిధి రామ గ్రామానికి చెందిన ఒంకార్ యాదవ్ (32), నయాగా గ్రామానికి చెందిన రాహుల్ సింహ్ (35), మొరినీ జిల్లా బిగుచిని గ్రామానికి చెందిన బలరాం యాదవ్ (28), సానియా గ్రామానికి చెందిన సచిన్ సింహ్ (43), ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఇటీవ జిల్లాలోని కుబారుకుట గ్రామానికి చెందిన దీపక్ సింగ్ (34) గా గుర్తించారు. నిందితులను తెలంగాణ పోలీసులకు గురువారం అప్పగించినట్లు రైల్వే పోలీసులు తెలియజేశారు.

చోరీ కేసులో ముగ్గురు అరెస్ట్

- 40 మొబైల్ ఫోన్లు స్వాధీనం


పోలీసులకు చిక్కిన నిందితులు

రాయగడ: మొబైల్ ఫోన్ల చోరీ కేసులో ముగ్గురు నిందితులను చంది పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను చంది ఐఐసీ ప్రసన్నకుమార్ బెహరా విలేకర్లకు తెలిపారు. గత నెల 28న జేకేపూర్ బీసీ రోడ్ సమీపంలోని మనోజ్ మొబైల్ దుకాణంలో చోరీ జరిగింది. ఈ ఘటనలో రూ.5లక్షల విలువైన ఫోన్లను దొంగలు ఎత్తుకెళ్లినట్లు దుకాణ యజమాని ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు కన్ను కొసల దేవేంద్ర, కొందోపాణి, గోపాల్ పారిడలను నిందితులుగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 40 మొబైల్ ఫోన్లు, పెన్‌డ్రైవ్‌లు, ఇయర్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు చంది ఐఐసీ ప్రసన్నకుమార్ తెలిపారు.

భార్యపై హత్యాయత్నం


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సస్మిత పాలక

రాయగడ: స్థానిక రాణిగూడ ఫారం ఎనిమిదో లైన్‌లో సాయి చందన్ త్రిపాఠి అనే వ్యక్తి తన భార్యను మూడో అంతస్తు నుంచి కిందకు తోసి చంపేయాలని ప్రయత్నించాడు. ప్రస్తుతం ఆమె ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. రాణిగుడ ఫారం ఎనిమిదో లైన్‌లో నివసిస్తున్న సాయి చందన్ త్రిపాఠి, సస్మిత పాలకలు భార్యాభర్తలు. రెండేళ్ల కిందటే వీరు ప్రేమ వివాహం చేసుకున్నారు. అయితే కొంతకాలంగా వీరిద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం ఇద్దరి మధ్య పెరిగిన గొడవ చినికిచినికి గాలివానలా మారింది. దీంతో అతను పైఅంతస్తు నుంచి భార్యను కిందకు తోసేశాడు. భార్య రక్తపు మడుగులో ఉన్నా పట్టించుకోకుండా పరారైపోయాడు. కాలనీ వాసులు వెంటనే సస్మితను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ విషయాన్ని సస్మిత తల్లిదండ్రులకు చెప్పారు. దీంతో వారు ఆస్పత్రికి వెళ్లి సస్మితను బరంపురం ఆస్పత్రికి తరలించారు. ఘటనపై సస్మిత తమ్ముడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రొటోకాల్ పాటించకపోవడం దారుణం


సమావేశంలో మాట్లాడుతున్న భృగు భక్షిపాత్రో

పర్లాకిమిడి: అధికారులు ప్రొటోకాల్ పాటించకపోవడం దారుణమని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భృగు భక్షి పాత్రో అన్నారు. పర్లాకిమిడి పట్టణం నడిబొడ్డున ఆర్.ఉదయగిరి ప్రాంతీయ మార్కెటింగ్ కోపరేటివ్ సొసైటీ (ఆర్.ఎం.సి.ఎస్.) ఆధ్వర్యంలో గురువారం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వారి సహకారంతో పెట్రోలు బంకును ప్రారంభించారు. అయితే అధికార పార్టీ బీజేడీ, బీజేపీ శ్రేణుల మధ్య ఘర్షణలు తలెత్తిన వివాదం చిలికి చిలికి గాలివాన అయ్యింది. బంకు ప్రారంభమైనా కొన్ని సాంకేతిక కారణాలతో శుక్రవారం అమ్మకాలు జరుగలేదు. ఈ నేపథ్యంలో రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు భృగు భక్షి పాత్రో పర్లాకిమిడిలోని ఆ పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంకు ప్రారంభోత్సవ శిలాఫలకంపై స్థానిక ఎమ్మెల్యే కోడూరు నారాయణ రావు పేరును ఎందుకు రాయలేదని ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్, డీఆర్‌సీఎస్, కోపరేటివ్ సొసైటీ అసిస్టెంటు రిజిస్ట్రారు, మున్సిపల్ చైర్‌పర్సన్ పేర్లు ఉన్నప్పటికీ వారు ప్రారంభోత్సవానికి హాజరు కాలేదన్నారు. కానీ అధికారులు ప్రొటోకాల్‌ను విస్మరించి స్థానిక ఎమ్మెల్యే పేరును చేర్చనందున దీనిపై కేంద్ర పెట్రోలియం శాఖకు ఫిర్యాదు చేశామన్నారు. అలాగే జిల్లా కలెక్టర్, డైరెక్టర్ కోపరేటివ్ సూసైటీస్, ఏఆర్‌సీఎపై స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు భృగు భక్షి పాత్రో వివరించారు. బీజేడీ పార్టీ నాయకులు పెట్రోలు బంకు ప్రారంభోత్సవంలో గూండాల్లా ప్రవర్తించడం తగదన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ అధ్యక్షుడు డుల్లు మిశ్రా, పట్టణ పార్టీ అధ్యక్షులు కుమార్, కౌన్సిలరు, బీజేపీ యువజన కార్యదర్శి బాలక్రిష్ణ పాత్రో పాల్గొన్నారు.

రహదారి భద్రతకు ప్రాధాన్యం


మంత్రి టుకుని సాహు అధ్యక్షతన రహదారి భద్రత సమీక్ష సమావేశం

- మంత్రి టుకుని సాహు
- రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల నివారణ భేష్: సుప్రీం కోర్టు అధ్యయన కమిటీ


చీఫ్ సెక్రటరీతో రోడ్డు భద్రతపై సుప్రీంకోర్టు కమిటీ కార్యదర్శి సంజయ్ మిట్టల్ భేటీ

భువనేశ్వర్: రహదారి భద్రతకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర వాణిజ్య, రవాణా శాఖ మంత్రి టుకుని సాహు అన్నారు. స్థానిక లోక్‌సేవా భవనం మూడో అంతస్తు సమావేశం హాల్‌లో శుక్రవారం రోడ్డు భద్రతా మండలి సమావేశం నిర్వహించారు. టుకుని సాహు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు పలు అంశాలపై చర్చించారు. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ రోడ్డు భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, ముఖ్యమంత్రి రహదారి భద్రత పథకాన్ని అమలు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. దీని కోసం బడ్జెట్‌లో రూ.145 కోట్ల నిధులు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. సమావేశంలో చీఫ్ సెక్రటరీ, అభివృద్ధి కమిషనర్ సహా పలువురు సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

సుప్రీం కోర్టు కమిటీ ప్రశంసలు

రోడ్డు ప్రమాదాలను తగ్గించడంలో ఒడిశా విజయం సాధించిందని సుప్రీం కోర్టు కమిటీ ప్రశంసలు కురిపించింది. రహదారి భద్రతపై అవగాహన, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై చర్యలు, రోడ్డు ఇంజినీరింగ్‌లో మెరుగుదల, తక్షణ అత్యవసర చికిత్స సేవలు.. ఈ నాలుగు విధానాల వాస్తవ కార్యాచరణతో ఒడిశా రోడ్డు ప్రమాదాలను నిరోధించగలిగిందని సుప్రీం కోర్టు కమిటీ కార్యదర్శి సంజయ్ మిట్టల్ తెలిపారు. రాష్ట్ర పర్యటన సందర్భంగా ఆయన రాష్ట్రంలో పలు జిల్లాలు సందర్శించారు.

రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలు, ప్రమాద మరణాలు తగ్గుముఖం పట్టాయి. రాష్ట్రంలో 2022 సంవత్సరపు ద్వితీయ త్రైమాసికంతో పోలిస్తే 2023 సంవత్సరపు రెండో త్రైమాసికంలో రోడ్డు ప్రమాదాలు, ప్రమాద మరణాలు తగ్గాయి. రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలు 7.56 శాతం, రోడ్డు ప్రమాద మరణాలు 6.24 శాతం తగ్గాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ చర్యలు, ప్రయత్నాలను సుప్రీంకోర్టు కమిటీ ప్రశంసించింది.

రోడ్డు భద్రతకు సంబంధించిన సుప్రీం కోర్టు ఆదేశాలను అధ్యయనం, ఆడిట్ చేయడానికి కార్యదర్శి సంజయ్ మిట్టల్ 5 రోజుల రాష్ట్ర పర్యటనలో ఉన్నారు. భువనేశ్వర్‌లో రోడ్డు భద్రతపై లీడ్ ఏజెన్సీల సభ్యులతో ఆయన సమావేశం నిర్వహించి రోడ్డు ప్రమాదాల నివారణలో ఒడిశా చేస్తున్న కృషిని ప్రశంసించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అత్యవసర సేవలను ఏకీకృతం చేయడానికి రాష్ట్రం చేస్తున్న ప్రయత్నాలు ఆదర్శప్రాయమైనవని తెలిపారు. కస్టోడియన్ జూనియర్ల ద్వారా ఏసీసీ వలంటీర్లకు రక్షక్ జూనియర్ కార్యక్రమంలో భాగంగా శిక్షణ ఇవ్వడం వంటి కార్యకలాపాల్లో ప్రభుత్వ చొరవను సంజయ్ మిట్టల్ ప్రశంసించారు. మిట్టల్ గతంలో పూరీ గంజాం జిల్లాలను సందర్శించారు. ఈ రెండు జిల్లాల పరిపాలనా విభాగాల అధికారులతో చర్చించారు. ప్రత్యేకంగా 316వ నంబరు జాతీయ రహదారి (భువనేశ్వర్ - పూరీ) 16వ నంబరు జాతీయ రహదారి (భువనేశ్వర్ - బరంపురం) ప్రత్యక్షంగా సందర్శించారు. రెండు రహదారులపై కొన్ని దిద్దుబాటు చర్యలు చేపట్టాలని సూచించారు.

చీఫ్ సెక్రటరీతో భేటీ

రాష్ట్ర పర్యటనలో ఉన్న రోడ్డు భద్రతపై సుప్రీంకోర్టు కమిటీ కార్యదర్శి సంజయ్ మిట్టల్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనాను మర్యాదపూర్వకంగా కలిశారు.

కార్యక్రమంలో రాష్ట్ర రవాణా కమిషనర్ అమితాబ్ ఠాకూర్ కూడా పాల్గొన్నారు. రోడ్డు భద్రతా చర్యలపై ఒడిశా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై సంజయ్ మిట్టల్ సంతోషం వ్యక్తం చేశారు. రోడ్డు భద్రతపై ఆరోగ్య శాఖ, రవాణా శాఖ, పోలీసులు తీసుకుంటున్న చర్యలపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చీఫ్ సెక్రటరీ ప్రదీప్ కుమార్ జెనా కొన్ని సూచనలు జారీ చేశారు.

క్లుప్తంగా

ఘనంగా సీతారామకల్యాణం



నిత్యకల్యాణం జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల: పవిత్రపుణ్యక్షేత్రం రామతీర్థంలో శ్రీసీతారామచంద్ర స్వామి నిత్య కల్యాణాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శ్రావణ శుక్రవారం పర్వదినం సందర్భంగా స్వామివారి సన్నిధిలో అర్చకులు ప్రత్యేక పూజలు జరిపించారు. అలాగే యాగశాలలో సుందరకాండహవనం, ఆదిత్యహృదయ హవనం, సుదర్శన అష్టకం హవనం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ ఆలయంలో ప్రతిరోజూ కల్యాణం నిర్వహిస్తున్నామని భక్తులు అధికసంఖ్యలో హాజరుకావాలని కోరారు.

వెబ్‌సైట్‌లో ఎన్‌హెచ్‌ఎం పోస్టుల తుదిమెరిట్ జాబితా

విజయనగరం ఫోర్ట్: ఎన్‌హెచ్‌ఎం (నేషనల్ హెల్త్ మిషన్) పరిధిలోని ఎన్‌సీయూ, పీపీహెచ్‌సీ, డీఈఐసీల్లో ఖాళీ పోస్టుల భర్తీకి సంబంధించి గత నెల 7వతేదీన ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం తుది జాబితాను విజయనగరం.ఎన్‌ఐసి.ఇన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు వెబ్‌సైట్‌లో వివరాలు చూసుకోవాలని సూచించారు.

సంచార పశు ఆరోగ్య సేవలో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం ఫోర్ట్: డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవలో పోస్టుల భర్తీకి ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఈఎంఆర్‌జీహెచ్‌ఎస్ సంస్థ జిల్లా మేనేజర్ బి.నారాయణరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్యుల పోస్టులకు బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ విద్యార్హత కలిగిన వారు, ఉద్యోగ విరమణ చేసిన వారు అర్హులని తెలిపారు. పారావెట్‌కు డిప్లమా ఇన్ వెటర్నరీ సైన్స్ విద్యార్హత కలిగిన వారు, డ్రైవర్ పోస్టుకు 10 వతరగతి ఉత్తీర్ణులైన వారు, హెవీ లైసెన్స్ కలిగి, 2 ఏళ్ల అనుభవం ఉన్నవారు అర్హులని తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు వైజంక్షన్‌లో ఉన్న పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో దరఖాస్తుతో పాటు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9154970175 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.


కలెక్టరేట్ ఉద్యోగాలని నమ్మించిన నిందితుల అరెస్ట్

విజయనగరం క్రైమ్: కలెక్టరేట్‌లో తాము పీఆర్‌ఓలమని కంప్యూటర్ అసిస్టెంట్ ఉద్యోగాలిప్పిస్తానని నమ్మబలికి లక్ష రూపాయలు అడ్వాన్స్‌గా తీసుకునే క్రమంలో అది మోసమని బయటపడింది. దీంతో వెంటనే బాధితుడు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదుచేశారు. ఈ సంఘటనపై వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు శుక్రవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కలెక్టరేట్‌లో తాము పీఆర్‌ఓలమని కంప్యూటర్ అసిస్టెంట్ ఉద్యోగాలను ఇప్పిస్తానని నిందితులు పిల్లి నరసింగరావు, సిమ్మ లక్ష్మిలు..అనకాపల్లి జిల్లా సీతానగరం గ్రామానికి చెందిన ఎస్.సుంకర పోతురాజును నమ్మబలికారు. పోతురాజు, అయన భార్యకు ఉద్యోగాలిప్పిస్తామని అందుకు రూ.11 లక్షలు ఖర్చవుతుందని చెప్పారు. ఈ క్రమంలో లక్ష రూపాయలు అడ్వాన్స్‌గా ఇచ్చేందుకు గాను కలెక్టరేట్‌కు శుక్రవారం వచ్చిన పోతురాజుకు అక్కడే పనిచేస్తున్న మిత్రుడు కనిపించాడు. మిత్రుడికి విషయం చెప్పేసరికి ఉద్యోగాలిప్పిస్తామన్నవారు మోసగాళ్లని తేలింది. దీంతో పోతురాజు వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు నరసింగరావు, లక్ష్మిలను అరెస్టు చేసి కేసు నమోదుచేశారు.

రూ.16కే కిలో ఫోర్టిఫైడ్ చక్కీ గోధుమపిండి

పార్వతీపురం: జిల్లాలోని పార్వతీపురం, పాలకొండ, సాలూరు మున్సిపాలిటీ, గ్రామీణ ప్రాంత ప్రజలకు ఫోర్టిఫైడ్ గోధుమ పిండిని ఈ నెల నుంచి సరఫరా చేస్తామని జేసీ ఆర్.గోవిందరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పార్వతీపురంలో 11,325, పాలకొండలో 7,890, సాలూరులో 13,736 వెరసి 32,951 తెలుపు కార్డుదారులకు కార్డుకు కిలో చొప్పున రూ.16కు ఫోర్టిఫైడ్ చక్కీ గోధుమ పిండి పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. పార్వతీపురం రూరల్‌లో 19,855, పాలకొండ రూరల్‌లో 14,675 , సాలూరు రూరల్‌లో 18,304 వెరసి రూరల్ ప్రాంతాల్లోని 52,834 తెలు కార్డుదారులకు కూడా ఫోర్టిఫైడ్ చక్కీ గోధుమ పిండి సరఫరా చేస్తామన్నారు. గోధుమ పిండిలో ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బి12 వంటి సూక్ష్మ పోషకాలు ఉంటాయన్నారు.

ఏరియా ఆస్పత్రిలో ఈహెచ్‌ఎస్ స్కీం



ఎంప్లాయీస్ హెల్త్ స్కీంను ప్రారంభిస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.రత్నకుమారి

సాలూరు: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో ఎంప్లాయీస్ హెల్త్ స్కీం కింద వైద్యసేవలు అందజేస్తామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.రత్నకుమారి శుక్రవారం తెలిపారు. హెల్త్ కార్డులు ఉన్న ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఆరోగ్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జనం గుండెలో ఓ జ్ఞాపకం

గలగలమని పరవళ్లు తొక్కుతూ పొలాలకు పరుగుతీస్తున్న సాగునీటిని చూసినా..రోగుల కళ్లలో ఆరోగ్య భరోసా కనిపించినా..పదిలంగా ఉన్న చిన్నారుల హృదయాలను తట్టినా.. లక్షాధికారులుగా మారిన మహిళామణుల ఆర్థికాభివృద్ధిని గమనించినా..పెద్ద చదువులు చదివిన పేదింటి పిల్లలను కదిలించినా వారి మార్పుకు కారణభూతుడుగా చెప్పేది దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేరు మాత్రమే. ముఖ్యమంత్రిగా తన పరిపాలనలో చెరగని ముద్ర వేసిన ఆయన ప్రజల హృదయాల్లో సుస్థిరస్థానం సంపాదించారు. నేడు ఆయన వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రిగా ఆయన హయాంలో ప్రజలకు చేసిన మేలు గురించి ఓ సారి గుర్తు చేసుకుని నివాళులర్పిద్దాం.

- అన్ని వర్గాలకు అండగా నిలిచి..
- ప్రజల హృదయాల్లో సుస్థిరస్థానం
- నేడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ పథకం కింద చికిత్స పొందుతున్న రోగులు

విజయనగరం ఫోర్ట్: తీవ్రమైన కరువుతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న రోజులవి. పంటలు పండక , పెట్టుబడికి తెచ్చిన అప్పులు తీర్చలేక దిక్కుతోచని స్థితిలో కొట్టుమిడుతున్న కాలమది. పేదోడికి కేన్సర్, గుండె జబ్బు వస్తే వైద్యం చేయించుకోవడానికి ఆస్తులు అమ్ముకోవాల్సిన దీనస్థితి. అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రికి వెళ్లాలంటే ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సిన దుస్థితి. 2004కు ముందు ఉండే ఈ పరిస్థితులను తన పాదయాత్ర సందర్భంగా గమనించిన దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసే సంక్షేమ కార్యక్రమాలను తన పాలనలో చేపట్టారు.

ఆరోగ్య ప్రదాతగా చిరస్థాయి గుర్తింపు

పేద, మధ్య తరతి ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించడం కోసం దివంగత నేత వై.ఎస్. రాజశేఖరెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈపథకం కింద తెలుపు రేషన్ కార్డు కలిగిన వారికి ఆరోగ్యశ్రీ కార్డులు అందించారు. ఆరోగ్యశ్రీ కార్డు పట్టుకుని ప్రభుత్వ ఆస్పత్రి అయినా, కార్పొరేట్ ఆస్పత్రికి వెళ్లినా ఉచితంగా చికిత్స అందించేవారు. అంతేకాకుండా ఇంటికి వెళ్లడానికి ప్రయాణ చార్జీలు కూడా అందించేవారు. కార్పొరేట్ ఆస్పత్రులను ఎప్పుడూ కన్నెత్తి చూడని పరిస్థితి పేదవారిది. అలాంటిది ఆరోగ్యశ్రీ కార్డు చూపిస్తే చాలు స్వాగతం పలికి మరీ వైద్యం చేసేవారు. ఉత్తరాంధ్రలో పేద, మధ్యతరగతి వారే అధికం.జిల్లాలో 2007లో ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభించారు. ఆరోగ్య శ్రీ కార్డు కలిగిన ఎంతో మందికి ఆస్పత్రుల్లో చికిత్స అందించే సాయం చేసి పునర్జన్మ ప్రసాదించి ఆరోగ్య ప్రదాతగా పేరుగాంచారు.

వైఎస్ హయాంలో మడ్డువలసకు మహర్దశ



వంగర: మడ్డువలస ప్రాజెక్టు

వంగర: మండల పరిధి మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టుకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో మహర్దశ పట్టింది. ప్రాజెక్టు నిర్మాణం అనంతరం నీట మునిగిన ఆరు గ్రామాల నిర్వాసితులు భూములు, ఇళ్లు, ఖాళీ స్థలాలు, రవాణా ఖర్చుల కోసం 2007వ సంవత్సరంలో రూ.27 కోట్లు మంజూరు చేసి నిర్వాసితులకు న్యాయం చేశారు. 4500 కుటుంబాలకు న్యాయం చేశారు. అలాగే మడ్డువలస ప్రాజెక్టుతోపాటు కుడి ప్రధాన కాలువ నుంచి 50 కిలోమీటర్ల పొడవు వరకు ఆధునీకీకరణ పనులు చేసేందుకు మహానేత హయంలో ఆ ఫైలుకు రూ.47 కోట్లతో ఆమోదం లభించింది. దీంతో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లోని తొమ్మిది మండలాల్లో 31వేల ఎకరాల పంటపొలాలకు పుష్కలంగా సాగునీరందుతోంది. దీంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

104 ద్వారా పల్లె ముంగిట వైద్య సేవలు:

ఆస్పత్రులకు వెళ్లలేని వారికి కోసం పల్లె ముంగిటకు వెళ్లి వైద్య సేవలు అందించడం 104 వాహనాలను ప్రవేశపెట్టారు. బీపీ, సుగర్, ఆస్తమా, మూర్ఛ వంటి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ముందులు అందించేవారు. అదేవిధంగా గర్భిణులకు తనిఖీలు చేసేవారు. పిల్లలకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ముందులు అందించేవారు.

రైతులకు రుణ విముక్తి

2004 కు ముందు తీవ్ర కరువు పరిస్థితులు ఉండేవి. అన్నదాతలు పంట సాగుకు తెచ్చిన అప్పులు తీర్చలేక అత్మహత్యలకు పాల్పడేవారు. మరి కొంత మంది గ్రామాలు విడిచి వెళ్లేపోయేవారు. పంటలు పండక రైతులు సతమతమవుతుంటే బ్యాంకులు రుణాలు తీర్చాలని ఒత్తిడి చేసేవి. దీంతో రైతులు ఆందోళనకు గురయ్యే పరిస్థితుల్లో అధికారంలోకి వచ్చిన వైఎస్ రాజశేఖర్ రెడ్డి రైతుల రుణాలను పూర్తిస్థాయి మాఫీ చేసి అండగా నిలిచారు. అంతేకాకుండా వారికి తిరిగి రుణాలు ఇప్పించారు. రుణాలు సక్రమంగా చెల్లించిన రైతులకు ప్రోత్సాహకంగా రూ.5 వేలు చొప్పున చెల్లించారు.

అపరభగీరథుని ఆశయ ప్రతిరూపం పెద్దగెడ్డ రిజర్వాయర్



సాలూరు: పెద్దగెడ్డ ప్రాజెక్టు

సాలూరు: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి గుర్తులు సాలూరు నియోజకవర్గంలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. అపరభగీరథుడైన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయానికి నిలువెత్తు రూపం పాచిపెంట మండల కేంద్రంలోని పెద్దగెడ్డ జలాశయం. పుష్కలంగా నిండిన నీటితో రిజర్వాయర్, జలకళను సంతరించుకున్న సందర్భంలో, రిజర్వాయర్ కింద వేల ఎకరాలకు సాగునీరు అంది పచ్చని పైరుల పలకరింపులో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి గుర్తులు కనిపిస్తూనే ఉంటాయి. పెద్దగెడ్డ రిజర్వాయర్ పేరు చెప్పగానే ఇక్కడి ప్రజలకు గుర్తువచ్చేది ముందుగా రాజశేఖర్‌రెడ్డే. జలయజ్ఞంలో భాగంగా ఇక్కడ ప్రజలకు తాగు నీరు, రైతులకు సాగునీరు అందించే ఉద్దేశంతో పాచిపెంట పెద్దగెడ్డ రిజర్వాయర్‌ను నిర్మించారు.

వైఎస్సార్ కుటుంబం రైతు పక్షపాతి



రైతుల కష్టాలు రాజశేఖర్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రల్లో క్షేత్రస్థాయిలో చూశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జలయజ్ఞంలో రాష్ట్రంలో తొలిసారిగా పాచిపెంట పెద్దగెడ్డ రిజర్వాయర్ నిర్మాణం పూర్తి చేసి ఆయనే ప్రారంభించారు. మామిడిపల్లిలో బురదాలమ్మ ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు. ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో నియోజకవర్గంలో ప్రాజెక్టుల ఆధునీకీకరణకు కోట్లాది రుపాయలు మంజూరుచేశారు. తండ్రి, తనయుల పాలనలో పనిచేయడం నా అదృష్టం.

– పీడిక రాజన్నదొర, ఉపముఖ్యమంత్రి గిరిజన సంక్షేమశాఖామంత్రి

రైలు ఢీకొని వ్యక్తి మృతి



రైల్వే ట్రాక్‌పై శ్రీహరినాథ్ బాబు మృతదేహం

కొమరాడ/కురుపాం: కురుపాం మండలం శివ్వన్నపేట గ్రామానికి చెందిన కొండేటి గౌరీశంకర్‌రావు (39) కొమరాడ మండలం గుమడ సమీపంలో రైలు ఢీకొని మృతి చెందినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ రత్నాకర్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గుమడ గ్రామంలో బంధువుల ఇంటికి వచ్చి తిరుగు ప్రయాణంలో రైల్వేస్టేషన్‌కు వెళ్తుండగా రైలు ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. వెంటనే కుటుంబ సభ్యులకు సమచారం అందించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమత్తం పార్వతీపురం జిల్లా అస్పత్రికి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ పేర్కొన్నారు.

గూడ్స్ ఢీకొని మరొకరు..

పార్వతీపురంటౌన్: పట్టణంలోని బెలగాం రైల్వేస్టేషన్ వద్ద గూడ్స్ ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ప్రమాదంపై జీఆర్‌పీ సిబ్బంది తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురంలోని బంగారమ్మ కాలనీకి చెందిన గద్ద శ్రీహరినాథ్ బాబు(42), తల్లి లక్ష్మి పార్వతీపురం బెలగాం రైల్వేస్టేషన్ ట్రాక్ దాటుతుండగా గమనించని శ్రీహరినాథ్‌బాబును గూడ్స్ ఢీకొంటున్న సమయంలో తల్లి అప్రమత్తమై లాగేందుకు ప్రయత్నించినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. అక్కడికక్కడే మృతిచెందాడు. తనయుడిని బతికించుకోవాలని తల్లి చేసిన ప్రయత్నంలో ఆమె చేతికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనపై జీఆర్‌పీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

విశ్వగురువుగా తీర్చిదిద్దడమే నాభూమి నా దేశం

- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశీవిశ్వనాథ రాజు



మాట్లాడుతున్న బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశీ విశ్వనాథరాజు

విజయనగరం టౌన్: తరతరాలుగా ప్రజల్లో నాటుకుపోయిన వలస వాద మనస్తత్వ ఆలోచనలు తొలగించి, అభివృద్ధి చెందిన భారతదేశంలో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేసి, భారత దేశాన్ని విశ్వగురువుగా తీర్చిదిద్దడమే ప్రధాని నరేంద్రమోడీ తలపెట్టిన నా భూమి –నా దేశం కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశీ విశ్వనాథరాజు పేర్కొన్నారు. స్థానిక రింగురోడ్డులో ఉన్న బీజేపీ జిల్లా కార్యాలయంలో అసెంబ్లీ కన్వీనర్లు, మండలాధ్యక్షులు, వివిధ మోర్చాల నాయకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఆయన మాట్లాడుతూ గ్రామీణ భారతానికి ప్రాధాన్యతనిస్తూ , మట్టి విలువను తెలియజేస్తూ, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములను చేస్తూ , దేశం కోసం సర్వస్వం అర్పించిన వీరుల స్ఫూర్తిని ప్రతిఒక్కరిలో నింపాలన్నదే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని చెప్పారు.

ప్రధానమంత్రి మోడీ ప్రవేశపెట్టిన ఐదుసూత్రాల నుంచి ప్రేరణ పొందుతూ ఏర్పాటుచేసిన నా భూమి–నా దేశం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని, పార్టీ నాయకులు గద్దె బాబురావు, తీగల హరినాథ్, నడుకుదుటి ఈశ్వరరావు, కోటగిరి నారాయణరావు, బొబ్బిలి శ్రీను, అప్పలాచారి, ఉత్తరావల్లి మోహనరావు, పతివాడ రాజేష్, బవిరెడ్డి శివప్రసాదరెడ్డి, బూర్లె శ్రీధర్, మరిశర్ల రామారావు, గొర్డు పద్మ, ఎస్‌వీఎల్‌ఎన్.రాజు తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో ముద్దాయికి 10 ఏళ్ల జైలుశిక్ష

సాక్షి ప్రతినిధి, విజయనగరం: విజయనగరం జిల్లా వల్లంపూడి పోలీస్‌స్టేషన్ పరిధిలో 2016లో నమోదైన వరకట్నం వేధింపులు, హత్యానేరం కేసులో ముద్దాయికి పదేళ్ల జైలుశిక్ష, రూ. 5వేలు జరిమానా విధిస్తూ విజయనగరం 1వ అదనపు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి జి.రజని శుక్రవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఏడాది పాటు జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. ఈ కేసుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. వేపాడ మండలం, ఆతవ గ్రామానికి చెందిన కశిరెడ్డి సన్యాసినాయుడికి విశాఖపట్నం జిల్లా, కె.కోటపాడు మండలం, సూదివలస గ్రామానికి చెందిన పార్వతితో 2013, మే నెలలో వివాహం జరిగింది. ఆ దంపతులకు ఒక పాప జన్మించింది. కొన్నాళ్ల తరువాత అదనపు కట్నం కోసం శారీరకంగా, మానసికంగా పార్వతిని వేధిస్తూ, కన్నవారింటికి సన్యాసినాయుడు వెళ్లగొట్టాడు. తరువాత కొన్నాళ్లకు బాగా చూసుకుంటానని నమ్మించి తిరిగి కాపురానికి తీసుకువచ్చాడు. అయితే మళ్లీ యథాప్రకారం అదనపు కట్నం కోసం శారీరకంగా, మానసికంగా వేధిస్తుండేవాడు. భర్త ప్రవర్తనలో ఎటువంటివంటి మార్పు రాకపోవడంతో మనస్తాపం చెందిన పార్వతి 2016 మార్చి 10న ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని చనిపోయింది. ఈ విషయమై పార్వతి తల్లి వర్రి లక్ష్మి ఫిర్యాదు మేరకు అప్పటి వల్లంపూడి ఎస్సై ఎం.కృష్ణమూర్తి వరకట్న వేధింపులు, హత్యానేరం కింద కేసు నమోదు చేశారు. అప్పటి విజయనగరం డీఎస్పీ టి.వెంకటరత్నం దర్యాప్తు చేపట్టి, నిందితుడిని అరెస్టు చేసి, కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. కోర్టు విచారణలో నేరం రుజువు కావడంతో ముద్దాయి సన్యాసినాయుడికి కారాగార శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

రాజన్నదొర ఆద్వర్యంలో నేడు వైఎస్సార్ వర్ధంతి



వైఎస్సార్ అక్షరమాలలో విద్యార్థులు

సాలూరు: ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖామంత్రి పీడిక రాజన్నదొర ఆద్వర్యంలో శనివారం సాలూరు నియోజకవర్గంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా సాలూరు పట్టణంలో వైఎస్సార్ విగ్రహానికి రాజన్నదొర పూలమాలలు వేసి నివాళులు అర్పించనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు తరలిరావాలని ఉపముఖ్యమంత్రి కార్యాలయ వర్గాలు శుక్రవారం ఓ ప్రకటనలో కోరాయి.

వైఎస్సార్ అక్షరమాలలో విద్యార్థులు

వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా సాలూరు పట్టణంలోని వెంకటవిద్యాగిరి పాఠశాల విద్యార్థులు వైఎస్సార్ అక్షర మాలగా రూపొంది ఆయనకు నివాళులు అర్పించారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

లక్కవరపుకోట: మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన సీల వెంకటరమణ(56) ఆర్థిక ఇబ్బందులు తాళలేక చెట్టుకొమ్మకు ఉరివేసుకుని శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై ఎల్.కోట ఎస్సై ముకుందరావు, స్థానికులు తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. కొత్తవలస మండలంలోని శారద కర్మాగారం క్యాంటీన్‌లో వంటమనిషిగా వెంకటరమణ పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం కిరాణా సామగ్రి తీసుకొస్తానని భార్యకు చెప్పి గోల్డ్‌స్టార్ జంక్షన్‌కు వచ్చాడు. 12 గంటలు దాటినా తిరిగి ఇంటికి రాకపోవడంతో భార్య వాకబు చేయగా గ్రామానికి వచ్చే దారిలో గల మామిడి తోటలో చెట్టు కొమ్మకు ఉరివేసుకుని ఉండడం స్థానికులు గుర్తించి ఆమెకు చెప్పారు. ఈ మేరకు ఆమె ఎల్.కోట పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించడంతో ఎస్సై ముకుందరావు ఘటనా స్థలానికి చేరుకుని శవపంచనామా చేసి పోస్టుమార్టం నిమిత్తం ఎస్.కోట సీహెచ్‌సీకి మృతదేహాన్ని తరలించారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఇద్దరు కుమార్తెలకు వెంకటరమణ పెళ్లిళ్లు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

గెడ్డగూడలో పులిసంచారం



పెద్దపులి సంచారంపై అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ సిబ్బంది

సీతంపేట: గెడ్డగూడ సమీపంలో పులి సంచరిస్తున్నట్టు ఆ గ్రామ గిరిజనులు తెలిపారు. సుక్కయ్య అనే పశువుల కాపరి శుక్రవారం తెల్లవారుజామున పులిని చూసినట్టు చెప్పడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. సమాచారం అందుకున్న అటవీశాఖ సిబ్బంది గెడ్డగూడ ప్రజలను అప్రమత్తం చేశారు. పులి కనిపిస్తే కవ్వింపు చర్యలు చేపట్టవద్దని హెచ్చరించారు.

విశాఖలో బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లా క్రీడాకారులు



సబ్‌జూనియర్స్ బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు

విజయనగరం: విశాఖ వేదికగా జరుగుతున్న రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లా క్రీడాకారులు శుక్రవారం పయనమయ్యారు. ఈనెల 1వ తేదీ నుంచి 3 వ తేదీ వరకు సబ్ జూనియర్స్ విభాగంలో పోటీలు నిర్వహిస్తుండగా..జిల్లా నుంచి 9 మంది క్రీడాకారులు సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో ప్రాతినిధ్యం వహిస్తారు. బాలికల విభాగంలో ఎం.సంజన మోల్, ఎస్.దాక్షిణ్య, ఎం.డి.నిషాద్ ఫాతిమా,వై. రేణుశ్రీ, వై.హిమబిందులు అంతర్ జిల్లాల పోటీలకు జిల్లా తరఫున పోటీ పడనుండగా..బాలుర విభాగంలో ఎం.తరుణ్, సీహెచ్. మేగ్‌వర్ష, ఎ.విజయ్ చైతన్య, ఎం.చరణ్‌తేజలు సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో తలపడతారు. రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న క్రీడాకారులకు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు క్రీడాదుస్తులు అందజేశారు. జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ కోలగట్ల వీరభద్రస్వామి, అధ్యక్షుడు ఇందుకూరి రఘురాజు, ఉపాధ్యక్షుడు డాక్టర్ వీఎస్‌ప్రసాద్, ఎంకేబీ శ్రీను, ప్రధాన కార్యదర్శి వై.కుసుంబచ్చన్; కార్యదర్శి నున్న సురేష్‌లు క్రీడాకారులను అభినందించారు.

వ్యాయామ విద్యలో పీహెచ్‌డీ

- పట్టా అందుకున్న ధర్మవరపు రాంబాబు



ఆచార్య నారాగార్జున యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ రాజశేఖర్ పట్టేట్ చేతుల మీదుగా పీహెచ్‌డీ అందుకుంటున్న ధర్మవర్మపు రాంబాబు

విజయనగరం: వ్యాయామ విద్యపై మక్కువ పెంచుకుని అదే రంగంలో రాణిస్తున్న నెల్లిమర్ల మండలం సారిపల్లి గ్రామానికి చెందిన ధర్మవరపు రాంబాబు వ్యాయామ విద్యలో పీహెచ్‌డీ సాధించారు. ఎఫెక్ట్ ఆఫ్ ప్లయోమెట్రిక్ ట్రైనింగ్ అండ్ రెసిస్టెన్స్ ట్రైనింగ్ ఆన్ సెలెక్టర్ ఫిజికల్, ఫిజిలాజికల్ అండ్ సైకాలజికల్ వేరిబుల్స్ అంశంపై పరిశోధన చేసినందుకు గాను ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ రాజశేఖర్ పట్టేట్ చేతుల మీదుగా గత నెల 29న పట్టా అందుకున్నారు. తన పరిశోధనకు సహకారం అందించిన నాగార్జున యూనివర్సిటీ వ్యాయామ విద్య కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.జాన్సన్‌కు ఈ సందర్భంగా రాంబాబు కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం ఆయన తిరుపతిలోని పద్మావతి మహిళా యూనివర్సిటీలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. రాంబాబు పీహెచ్‌డీలో సాధించటం పట్ల వ్యాయామ ఉపాధ్యాయులు అభినందించారు.

ఏసీబీ అధికారులకు చిక్కిన ట్రాన్స్‌కో ఏఈ



విజయనగరంలో ఏఈ శాంతారావు (లుంగీతో ఉన్న వ్యక్తి) ఇంటిలో ఏసీబీ అధికారుల సోదాలు

విజయనగరం క్రైమ్/మక్కువ: ఎట్టకేలకు ట్రాన్స్‌కో ఏఈ పోలాకి శాంతారావు ఏసీబీ అధికారులకు చిక్కాడు. నాలుగు రోజులపాటు పరారీలో ఉన్న ఏఈను విశాఖపట్నంలోని సీఎంఆర్ సెంట్రల్ సమీపంలో అదుపులోకి తీసుకున్నట్టు ఏసీబీ డీఎస్పీ రామచంద్రరావు తెలిపారు. విద్యుత్ కనెక్షన్ మంజురుకు పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండలం ములక్కాయవలసకు చెందిన రైతు డి.ఈశ్వరరావు నుంచి ఏఈ రూ.60వేలు డిమాండ్ చేయగా రూ. 20వేలు చెల్లించాడు. ఆగస్టు 27న సాయంత్రం మిగిలిన బ్యాలెన్స్ రూ.40వేలు కారులో ఇస్తుండగా ఏసీబీ అధికారులు ఏఈపై దాడి చేశారు. ఆ సమయంలో అధికారులను గుర్తించిన ఏఈ.. తన కారును వేగంగా పొలాల్లోకి నడిపాడు. ఆయనను వెంబడించిన సీఐను ఢీకొట్టి గాయాలపాలుచేశాడు. పొలాల్లోనే కారును విడిచిపెట్టి పరారయ్యాడు. ఆయన కారును ఏసీబి అధికారులు సీజ్ చేసి, మక్కువ పోలీసు స్టేషన్‌కు తరలించారు. పరారీలో ఉన్న ఏఈ కదలికలపై నిఘా పెట్టి పట్టుకున్నారు. ఏఈ సమక్షంలోనే విజయనగరంలో ఆయన ఇంట్లో శుక్రవారం మధ్యాహ్నం సోదాలు జరిపారు. 350 గ్రాముల బంగారం, సుమారు రెండు కిలోల వెండి, ఆస్తి పత్రాలు స్వాధీనం చేసుకున్నారు.

అద్దె ఇంటిలోనూ సోదాలు

మక్కువ ఎస్సీకాలనీ సమీపంలో ఏఈ నివసిస్తున్న అద్దె ఇంటిలో ఏసీబీ సీఐ శ్రీనివాసరావు, తన సిబ్బందితో సోదాలు జరిపారు. ఏఈ కుటుంబసభ్యుల సమక్షంలో వివిధ పత్రాలను పరిశీలించారు. విలువైన డాక్యుమెంట్లు ఏమైనా దొరికాయా? లేదా? అన్న విషయాన్ని ఏసీబీ అధికారులు వెల్లడించలేదు.



మక్కువలో ఏఈ నివసిస్తున్న అద్దెఇంట్లో సోదాలు నిర్వహిస్తున్న ఏసీబీ అధికారులు